www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబరు 2025
5
ఏలూరు

జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో 30 యాక్ట్ అమలు
సిఐ బి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలోని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో 30 యాక్ట్ అమలులో ఉందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు అంతరాయం కలిగించే, ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే సమావేశాలు, ర్యాలీలు వంటి కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ఏమైనా కార్యక్రమాలు నిర్వహించినా, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

'పంచాయతీ' పరేషాన్..!

ఎన్నికపై ఈ నెల 3న ప్రభుత్వానికి ఎన్నికల కమీషన్ లేఖ

ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ సైతం విడుదల

అక్టోబర్ 16వ తేదీ లోపు డీలిమిటేషన్ పూర్తికి షెడ్యూల్

జనవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక

ప్రభుత్వ నుంచి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు మౌనం

గ్రామాల్లో వాడీవేడీగా పంచాయతీ ఎన్నికలపై చర్చ

ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు

పోటీచేసే ఆశావాహుల్లో ఉత్కంఠ.. ఎన్నికల నిర్వహణపై సందేహాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలపై అయోమయం నెలకొంది. సకాలంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా అన్న సందిగ్ధత నెలకొంది. జనవరిలో పంచాయతీ ఎన్నికల నిర్వహించనున్నట్లు, ఈ లోగా అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఎన్నికల కమిషన్ ఈ నెల మూడో తేదీన ప్రభుత్వానికి లేఖ రాసింది. ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ సైతం విడుదల చేసింది. అక్టోబర్ 16వ తేదీలోగా డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్లు ఖరారు చేయాలని, అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15వ తేదీలోపు వార్డులవారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులను నియమించుకోవాలని, నవంబర్ 16 నుంచి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకుని తుది జాబితా సిద్ధం చేసి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, 2026 జనవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్‌లో ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఇది జరిగి దాదాపు 20 రోజులు గడిచిపోతోంది. ఇప్పటి వరకూ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కదలిక లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ఇప్పటికీ ప్రారంభించలేదు. అక్టోబర్ 16వ తేదీలోపు డీలిమిటేషన్ పూర్తిచేయాలని ఎన్నికల కమీషన్ పేర్కొన్నా ఇప్పటి వరకూ కదలిక లేకపోవడం చూస్తే ఎన్నికలు సకాలంలో జరుగుతాయా అన్న సందేహం ఏర్పడుతోంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. 2020 ఫిబ్రవరిలో నాలుగు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. నాలుగో విడత ఎన్నికలు ఫిబ్రవరి 21వ తేదీతో ముగిశాయి. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికల కాలం ఐదేళ్లు ముగియనుంది. ఆ లోగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నట్లు ఎన్ని కమీషన్ లేఖ చెబుతోంది. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదన్న వాదన వినిపిస్తోంది. ఎన్నికల కమీషన్ లేఖతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మాత్రం మొదలైంది.

ఆశావాహుల్లో ఉత్కంట.. ఎన్నికల నిర్వహణపై సందేహాలు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచిగా పోటీ చేయాలనుకునే ఆశావాహులంతా ఇప్పటికే రాజకీయ నేతలను కలుస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ హడావుడీ చేస్తున్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లు ఏ విధంగా ఉంటాయన్న అంచనాలు వేసుకుని అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఎన్నికల నిర్వహణపై సందేహాలు అలుముకున్నాయి. అక్టోబర్ రెండో తేదీ తర్వాత ఎన్నికల పనులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయంటూ అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. జిల్లాల విభజన సమస్యలు పూర్తిచేసిన తర్వాత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలవుతోందన్న అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా పంచాయతీ ఎన్నికలపై మాత్రం గ్రామాల్లో సందడి కొనసాగుతోంది. గెలుపోటములపై అంచనాలు వేసుకుంటూ అభ్యర్థులకు సంబంధించి చర్చ నడుస్తోంది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పిజె.అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గర్భిణులు, చిన్న పిల్లలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పిజె.అమృతం తెలిపారు. ఆదివారం గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధులు రాకుండా, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వచ్చినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పిజె.అమృతం ప్రజాశక్తితో జరిగిన ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో వరద ప్రభావానికి గురైన ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఏ విధమైన చర్యలు తీసుకున్నారు?

ఏలూరు జిల్లాలో వరద ప్రవాహానికి కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు గురయ్యాయి. ప్రస్తుతానికి వరద తగ్గింది. అయితే వరద తగ్గిన తర్వాతే మన పని ఎక్కువ ఉంటుంది. కాచి చల్లార్చిన నీరు తాగాలి. నీరు ఎక్కువగా నిల్వ ఉండడంతో దోమలు ఎక్కువగా పెరుగుతాయి కాబట్టి ఫీవర్ సర్వే చేస్తాం. ఎవరికైనా పాజిటివ్ వస్తే వారికి తక్షణం వైద్యం అందిస్తాం.

ప్రశ్న : గర్భిణులకు, చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

గర్భిణులు, చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధులు రావడానికి ఎక్కువ ఆస్కారం ఉంది. గర్భిణులకు, బాలింతలకు, ఐదు సంవత్సరాల్లోపు చిన్నపిల్లకు జబ్బులు త్వరగా సోకే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారి గురించి ఎక్కువగా సర్వైలెన్స్ నిర్వహిస్తాం. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి. నీరు ఎక్కువగా తీసుకోవాలి.

ప్రశ్న : గతంలో ఏలూరు జిల్లాలో డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయి? ఈ సారి డెంగీ కేసుల నిర్మూలనకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం డెంగీ కేసులు బాగా తగ్గాయి. అధికంగా కేసులు నమోదైన ప్రాంతాల్లో హెల్త్ అసిస్టెంట్లు అక్కడే ఉండి వారికి అన్ని విధాలా సేవలందించారు. పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో అలాగే నీరు నిల్వ లేకుండా చూసుకునేలా అవగాహన కల్పించాం. సర్వేలో డెంగీ పాజిటివ్ వస్తే వారికి తక్షణ వైద్యం అందించి, వారు పూర్తిగా కోలుకునే వరకూ జాగ్రత్తలు తీసుకున్నాం. దీంతో డెంగీ కేసులు తగ్గాయి.

ప్రశ్న : ప్రయివేటు ఆసుపత్రిలో ఎక్కువగా సిజేరియన్‌లు జరుగుతున్నాయని అంటున్నారు, వాటి నిర్మూలనకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

దీనిపై ప్రభుత్వం నుంచి కూడా మనకు సూచనలు ఉన్నాయి. జిల్లాలో ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహిస్తున్నాను. అవసరం లేకపోయినా సిజేరియన్ చేసే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. రాబోయే కాలంలో సిజేరియన్ కేసులు బాగా తగ్గేలా చూసుకుంటాం.

ప్రశ్న: మురుగునీటి వల్ల వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలకు ఏ విధమైన సూచనలు ఇస్తారు?

మురుగునీటి వల్ల ముందు వచ్చేది డయేరియా. కాచి చల్లార్చిన నీరు తాగడం శ్రేయస్కరం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ప్రశ్న : గ్రామస్థాయిలో ఆశా వర్కర్లను, అంగన్‌వాడీలను ఏ విధంగా సమన్వయం చేస్తున్నారు?

ఆశాలు గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి సేవలందిస్తారు. అంగన్వాడీలు వారికి పోషకాహారం అందజేశారు. ఇద్దరూ సమన్వయం చేసుకొని సేవలందిస్తున్నారు.

ప్రశ్న: పాఠశాలల్లో, కాలనీల్లో ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారా?

పాఠశాలల్లో, హాస్టళ్లలో, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయితే ప్రతి గురువారమూ హాస్టళ్లను సందర్శించి వంటగది, పారిశుధ్యం, తాగనీరు, మరుగుదొడ్లు, ఎలా ఉన్నాయో పరిశీలిస్తున్నాం. ఆడపిల్లలకు మెన్స్ట్రువల్ హైజీన్‌పై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో ప్రతి గురువారమూ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందిస్తున్నాం.

ప్రశ్న : వ్యాధుల నిర్మూలనకు ఏం చర్యలు చేపట్టారు?

ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూస్తున్నాం. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లార్వాను గుర్తించి గంబుజియ ఫిష్‌ను వదులుతున్నాం. ప్రతి ఇంట్లో వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : పిహెచ్‌సిల్లో సిబ్బంది కొరత ఉందా?

పిహెచ్‌సిల్లో సిబ్బంది కొరత ఉంది. జిల్లాలో 30 వరకూ ఖాళీలు ఉన్నాయి. డాక్టర్లు, స్టాఫ్ నర్సుల ఖాళీలను కూడా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

గిరిజనుల, ప్రజల నోరు నొక్కేందుకే పోలీసుల ఆంక్షలు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీ ప్రాంత గిరిజనుల, ప్రజల నోరు నొక్కేందుకే పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో పెడుతున్న నేవీ ఆయుధ డిపోను అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ఆర్అండ్ఆర్‌లో ఎల్‌టిఆర్ భూములు పెట్టొద్దని గిరిజనులు కోరుకుంటున్నారని తెలిపారు. టి.నరసాపురంలో ఎర్రకాలువ మిగులు భూములను దళితులు, పేదల సాగు కోసం అడుగుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాల్లో గిరిజనులు, దళితులు, పేదలకు తీవ్ర అన్యాయం చేస్తూ, భూస్వాములకు, గిరిజనేతరులకు కొమ్ము కాస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే గిరిజనులను, దళితులను, పేదలను అణిచివేయడానికి, వారు పోరాటాలు, ఆందోళనలు చేయకుండా పోలీసులు శాంతిభద్రతల పేరుతో 144 సెక్షన్, 30 సెక్షన్ జారీ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టి. నర్సాపురం ప్రాంతాల్లో శాంతి భద్రతలకు వచ్చిన విఘాతం ఏంటని ప్రశ్నించారు. ఈ ప్రాంతాల్లో శాంతి భద్రతలను కాపాడడానికి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది కాబట్టి ఎటువంటి సమావేశాలూ, ర్యాలీలూ, గుంపులుగా కూడుకొనే కార్యక్రమాలు నిర్వహించడం చేయరాదని పోలీసులు చెప్పడం కేవలం అణిచివేత చర్యలుగానే భావిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమకు జరుగుతున్న అన్యాయం కోసం శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఈ విధంగా ప్రజల నోరు నొక్కే ఇలాంటి ప్రకటనలు పోలీసులు చేయడం తగదని పేర్కొన్నారు. కచ్చితంగా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో పెడుతున్న ఆయుధ డిపోను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ఆర్అండ్ఆర్‌లో ఎల్‌టిఆర్ భూములు పెట్టడాన్ని గిరిజనులు వ్యతిరేకిస్తున్నారని, టి.నర్సాపురంలో ఎర్రకాలువ మిగులు భూములను దళితులు, గిరిజనులకు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారని ఆయన స్పష్టం చేశారు.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆవులయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లాలో బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపుతున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తెలిపారు. ఆదివారం స్థానిక న్యూ అశోక్ నగర్‌లోని ఎక్సైజ్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 140 గ్రామాల్లో నాటుసారా నిర్మూలన చేసినట్లు తెలిపారు. జిల్లాలో నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చినా 2024 అక్టోబర్ నుంచి 542 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసినట్లు, 546 మంది ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే బెల్ట్ షాపులకు మద్యం సప్లయ్ చేస్తున్న 4 మద్యం షాపులపై, ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ రేట్లు అమ్ముతున్న ఒక దుకాణంపై, లూజు అమ్మకాలు చేస్తున్న ఒక దుకాణంపై మొత్తం ఆరు మద్యం షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాలుగు షాపులు సస్పెండ్ చేసి 15 లక్షల 50 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే బహిరంగంగా మద్యం సేవిస్తున్న 109 మందిని అరెస్ట్ చేసి 109 కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాల విషయంలో 847 కేసులు నమోదు చేసి 907 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 5,907 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, రెండు లక్షల 20 వేల 910 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని తెలిపారు. 76 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, ముగ్గురిపై పీడీ యాక్టు నమోదు చేశామని తెలిపారు. ఈ సంవత్సరం రెవెన్యూ టార్గెట్ రూ.486 కోట్లు కాగా రూ.538 కోట్లు రెవెన్యూ సాధించినట్లు, 11 శాతం రెవెన్యూ పెరిగినట్లు తెలిపారు. ఎక్కడైనా ఎంఆర్‌పి ధరల ఉల్లంఘన జరిగితే 14405 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ 13 బార్లకు లైసెన్సులు అందజేశామని, మిగిలిన ఏడు బార్లకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని, అందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉందని తెలిపారు.

ఉద్యాన వన పంటల సాగుతో రైతుకు లాభం
తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉద్యాన వన పంటలను పరిశీలిస్తున్న మంత్రి నాగేశ్వరరావు

ఉద్యాన వన పంటల సాగుతో రైతుకు గణనీయమైన ఆదాయం పెరుగుతుందని తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షులు కొల్లూరి.రాంబాబుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన వన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే పంటలో మూడు రకాల ఉద్యాన పంటలు కోకో, కొబ్బరి, వక్క పండిస్తుండడంతో రాంబాబును అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉద్యాన వన పంటల సాగుతో రైతుకు గణనీయంగా ఆదాయం పెరుగుతుందన్నారు. అది కూడా ఒకే తోటలో అంతర పంటలుగా మూడు పంటలను సాగు చేస్తుండడంతో రైతుకు ఆదాయం పెరుగుతుందని, దీంతో రైతాంగం లాభపడి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. లక్ష్మీపురంలో కొల్లూరి రాంబాబుకు చెందిన ఉద్యాన పంటలను పరిశీలించడం ఇది రెండో సారని గుర్తు చేసుకున్నారు. ఆయనతో పాటు మాజీ సొసైటీ అధ్యక్షులు కొల్లూరి.రాంబాబు, ఉప సర్పంచి రాఘవరెడ్డి, రైతులు శ్రీ రామారావు, కొప్పుల చౌదరి రెడ్డి, తెలంగాణాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రైతుల త్యాగం.. దక్కని గౌరవం

గ్రీన్ ఫీల్డ్ హైవేకు మండలంలో నో ఎగ్జిట్ పాయింట్

సర్వీస్ రోడ్లు కూడా లేని వైనం

పలుమార్లు ధర్నాలు, ఎంపీకి వినతులు

ధర్నాలకు సమాయాత్తం అవుతున్న రైతులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఖమ్మం - దేవరపల్లి ప్రాంతాలను కలుపుతూ హైదరాబాద్-విశాఖ పట్టణం వెళ్లేందుకు దగ్గర చేస్తూ సుఖవంతమైన ప్రయాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ హైవే మండలంలోని ప్రజలకు అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది. మండలం మీదుగా హైవే నిర్మాణమైతే రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఇతర ప్రాంతాలకు ప్రయాణం సులువవుతుందని సంబరపడిన ప్రజల ఆశలు ఆవిరైపోయాయి. భూముల రేట్లు పెరుగుతాయని త్యాగాలు చేసి భూములిచ్చిన రైతులు సైతం కనీసం పొలాలకు వెళ్లడానికి సర్వీస్ రోడ్లు లేక గగ్గోలు పెడుతున్నారు. మండల కేంద్రమైన టి.నరసాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కడానికి దిగడానికి మండలంలో ఎక్కడా లేదు. హైవేకు అధికారులు ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ ఇవ్వలేదు. దీంతో మండల ప్రజలకు గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కే అదృష్టం లేకుండా పోయింది. హైవే ఎక్కాలంటే చింతలపూడి మండలం రేచర్ల వద్ద కాని జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్టుగూడెం వద్ద కాని ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు త్యాగాలు చేసి భూములిచ్చినా హైవే ఎక్కే అవకాశం ఇవ్వకపోవడం, కనీసం హైవే వెంబడి సర్వీస్ రోడ్లు కూడా నిర్మించకపోవడంతో రైతులతో పాటు నాయకులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎగ్జిట్, ఎంట్రీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందించారు. అంతే కాకుండా పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆందోళనలు చేపట్టేందుకు సమాయాత్తం అవుతున్నారు.

మూడేళ్ల క్రితం ఖమ్మం నుంచి ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలోని దేవరపల్లి వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం చేపట్టారు. దేవరపల్లి - తల్లాడ జాతీయ రహదారి డైమండ్ జంక్షన్ వద్ద రెండు కిలోమీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది. 162 కిలోమీటర్ల దూరం ఉన్న నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవేను పచ్చటి పొలాల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.4,609 కోట్లతో నిర్మించే ఈ రహదారి కోసం 31 గ్రామాల్లో 1996 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. ఖమ్మం - దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని హైదరాబాద్ - విశాఖపట్నం దూరం తగ్గించేందుకు ప్రధానంగా నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే 676 కిలోమీటర్లు సుమారు 12 గంటల పాటు ప్రయాణించాలి. ప్రధానంగా విజయవాడ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ కొత్త రహదారి పూర్తయితే విజయవాడ వెళ్లకుండానే సుమారు 125 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని చెబుతున్నారు.

ఖమ్మం - దేవరపల్లి వరకు ఉన్న ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు

ఖమ్మం - దేవరపల్లి మధ్య కేంద్రం నిర్మిస్తున్న సుమారు 162 కిలోమీటర్ల మేర ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే పైన ఇటు ఖమ్మం అటు దేవరపల్లి వద్ద తొమ్మిది చోట్ల మాత్రమే హైవే ఎక్కి దిగే అవకాశం ఉంది. వాటిలో ఖమ్మం రూరల్‌లోని వెంకటగిరి, దంసలాపురం, వైరా మండలంలోని సోమవారం, కల్లూరు మండలంలోని లింగాల, తిరువూరు మండలంలోని చింతగూడెం, సత్తుపల్లి మండలంలో వేంసూరు, చింతలపూడి మండలంలోని రేచర్ల, జంగారెడ్డిగూడెం మండలంలోని దేవులపల్లి, కొయ్యలగూడెం మండలంలోని పొంగుటూరు, దేవరపల్లిలో మాత్రమే వాహనాలు ఎక్కి దిగే పాయింట్లు ఉన్నాయి.

మండలం మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్రం పనులు ప్రారంభించినప్పుడు సస్యశ్యామలంగా ఉన్న భూములను, ఏడాదికి మూడు పంటలు పండే పొలాలు పామాయిల్, కోకో, కొబ్బరి వంటి ఆదాయం వచ్చే తోటలను సైతం హైవేకు రైతులు ఇచ్చి త్యాగం చేశారు. హైవే నిర్మాణమైతే భూముల ధరలు పెరుగుతాయి, రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని రైతులందరూ ఆశ పడ్డారు. కాని గ్రీన్ ఫీల్డ్ యాజమాన్యం రైతుల ఆశలపై నీళ్లు చల్లారు. మండలంలో హైవే ఎక్కడానికి ఎటువంటి అవకాశం లేకుండా చేశారు. కనీసం హైవే వెంబడి సర్వీస్ రోడ్లు కూడా నిర్మించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రోడ్లు స్థానంలో మొక్కలు నాటి పొలాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా చేశారని భూములిచ్చిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలంలో ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ ఇవ్వాలని సర్వీస్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

హైవే ఎక్కడానికి, దిగడానికి పాయింట్ ఏర్పాటు చేయాలి
గుడెల్లి వెంకట్రావు, సిపిఎం జిల్లా నాయకులు

మండలంలో గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కే అవకాశం ప్రజలకు వాహనదారులకు ప్రభుత్వం, యాజమాన్యం కల్పించాలి. మండల కేంద్రమైన టి.నరసాపురంలో కూడా ఎగ్జిట్ ఇవ్వకపోవడం అన్యాయం. మండలంలో రైతులు త్యాగాలు చేసి భూములు ఇచ్చారు. కాని హైవే మండల ప్రజలకు ఉపగపడడంలేదు. ఎగ్జిట్ ఇవ్వడం ద్వారా మండల ప్రజలకు మంచి చేకూరుతుంది. మండల ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉన్నతాధికారులు స్పందించి ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ ఏర్పాటు చేయాలి.

సర్వీస్ రోడ్లు నిర్మించాలి
అనుమోలు మురళి

మండలంలో నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ హైవే వెంబడి సర్వీస్ రోడ్లు నిర్మించాలి. సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల రైతులు పొలాలకు వెళ్లడానికి దారులు లేక ఇబ్బందులు పడుతున్నారు. హైవే కోసం రైతులు ఏడాదికి మూడు పంటలు పండే పొలాలు సైతం ఇచ్చి త్యాగం చేశారు. రైతుల సౌకర్యం మేరకు వెంటనే సర్వీస్ రోడ్లు నిర్మించాలి.

ముదినేపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇంటి అవరణలో చేరిన వర్షపు నీరు

ముదినేపల్లి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షంతో పాదచారులు, ద్విచక్ర చక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో వర్షానికి రహదారి అంతా చిత్తడి, చిత్తడిగా మారింది. వర్షానికి బేరాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు అసౌకర్యానికి లోనయ్యారు. ముదినేపల్లి, అన్నవరం జగనన్న కాలనీల్లో వర్షపు నీరు ఇళ్ల చుట్టూ భారీగా చేరింది. దీంతో కాలనీవాసులు వర్షపు నీటిలో నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్ల చుట్టూ, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు.

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సెప్టెంబరు 22వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం https://meekosam.ap.gov.in ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజా సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.


పెదబాబును సత్కరిస్తున్న ప్రముఖులు

ఎస్‌ఎంఆర్ పెదబాబుకు సత్కారం

ది ఏలూరు అవుట్‌డోర్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ది ఏలూరు అవుట్‌డోర్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్.పెదబాబు ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పవర్‌పేట ఐఎంఎ హాలులో నిర్వహించిన ది ఏలూరు అవుట్‌డోర్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్‌ఎంఆర్ పెదబాబు, అధ్యక్షులుగా వై.రంగారావు, సెక్రటరీగా వెంకట్, ట్రెజరర్‌గా బి.అప్పారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎస్‌ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి, టెక్నాలజీకి అనుగుణంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్ మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయితే మొబైల్ ఫోన్స్ వచ్చాక ఫొటో, వీడియో గ్రాఫర్స్ వృత్తి దెబ్బతిందన్నారు. ప్రభుత్వ పరంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్‌కు అందాల్సిన సహకారాన్ని పూర్తిగా అందే వరకు తను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబును మెమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు.

వంటావార్పు చేస్తున్న వడ్డిగూడెం వాసులు

మాకు న్యాయం చేయాలి

వైసిపి నేత ఇంటి వడ్డిగూడెం వాసుల వంటావార్పు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన వైసిపి నేత మోరు రామరాజు తమను మోసం చేసి డబ్బులు కాజేశారని వడ్డిగూడెం గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. గత 15 సంవత్సరాల క్రితం ఇంటి స్థలాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.57 లక్షలు తీసుకుని ఇవ్వకుండా మోసం చేశారంటూ ఆరోపించారు. ఏలూరులోని కట్ట సుబ్బారావు తోటలో ఉన్న మోరు రామరాజు ఇంటి వద్ద బాధితులు ఆదివారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మోరు రామరాజు అనే వ్యక్తి 15 సంవత్సరాల క్రితం పొలం కొనుగోలు చేసి ఇంటి స్థలాలు ఇప్పిస్తామంటూ 565 మంది నుంచి రెండు విడతల వారీగా రూ.57 లక్షలు వసూలు చేశారన్నారు. అదేవిధంగా సొసైటీగా ఏర్పరచుకున్న చేపల చెరువు లీజుకు తీసుకుని వాటి డబ్బు కూడా ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో డబ్బులు అడిగితే తిరిగి దాడి చేశారన్నారు. ఇటీవల రామరాజు ఇంటి వద్ద నిరసనకు దిగితే పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ తమకు న్యాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఆందోళన నిర్వహిస్తామని, మోరు రామరాజు ఇంటి నుంచి బయటకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో బాధితులు ముంగర విష్ణు, జయ మంగళ హరిబాబు, ఘంటసాల మారుతి, సర్పంచి జయ మంగళాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విద్యార్థులు

'ఆదిత్య'లో యూత్ పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యూత్ పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వంగ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.హరిబాబు, వివేకానంద కేంద్ర అధ్యాత్మిక సేవ ప్రేరేపిత సంస్థ రవినాయుడు ప్రాంతీయ సంఘటకులు, గండికోట శ్రీనివాసరావు విభాగ సంఘటకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుని సమాజంలో ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్ర అధ్యాత్మిక సేవ ప్రేరేపిత సంస్థ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ క్వాలిటీస్, టీమ్ వర్క్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, రీల్ మేకింగ్ వంటి అంశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన రీల్ మేకింగ్ కార్యక్రమంలో సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చాయి. ఈ ప్రోగ్రామ్‌లో విద్యార్థులు చురుకుగా పాల్గొని గ్రూప్ డిస్కషన్, రోల్ ప్లే యాక్టివిటీ, క్విజ్ సెషన్స్, నిర్వహించారు. దీని వల్ల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మాట్లాడే ధైర్యం కొత్త ఆలోచనలు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఎరువుల అక్రమ నిల్వపై కేసు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎటువంటి ఎరువుల లైసెన్స్ లేకుండా అక్రమంగా ఎరువులను నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లిలోని పాలచర్ల రోడ్డులో విజయ ట్రేడర్స్ పేరుతో గతంలో ఎరువుల లైసెన్స్ తీసుకొని దాన్ని రెన్యువల్ చేసుకోకుండా ఉంటూ దుకాణంలో అనధికారికంగా ఎరువులను నిల్వ ఉంచడంతో సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.3.52 లక్షల విలువైన ఎరువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు దుకాణానికి ఎటువంటి లైసెన్స్ లేకపోవడంతో వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వరకట్న వేధింపులపై ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లికి చెందిన షేక్ ఫర్జనాకు కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరుకు చెందిన కాటూరి కార్తీక్‌తో నాలుగేళ్ల క్రితం పరిచయం ఏర్పడి, ప్రేమించుకుని పెద్దల అంగీకారం లేకుండా పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భర్త కార్తీక్ కట్నం తీసుకురాలేదంటూ భార్యను మానసికంగా శారీరకంగా వేధిస్తున్నాడు. భర్త వేధింపులు భరించలేక ఫర్జానా సుమారు రెండేళ్ల క్రితం ముదినేపల్లి వచ్చి ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తుంది. భర్త తరచూ ముదినేపల్లి వచ్చి అనుమానిస్తూ వేధిస్తున్నాడు. ఆదివారం ఉదయం కార్తీక్ వచ్చి భార్యను తిట్టి, కొట్టడంతో చుట్టుపక్కల వారు కేకలు వేయగా వెళ్లిపోయాడు. దీంతో ఫర్జానా ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆ మలుపు.. ప్రమాదాలకు పిలుపు

చేబ్రోలు- తల్లాపురం రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు - తల్లాపురం వెళ్లే దారి చాలా అధ్వానంగా ఉండేది. గోతుల కారణంగా వాహనాలు ఆచితూచి వెళ్లేవి. ఎంఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.49 లక్షలతో చేబ్రోలు - తల్లాపురం రోడ్డులో పెద్దింట్లమ్మ ఆలయం వరకూ తారు రోడ్డుగా నిర్మాణ పనులు కొంత వరకూ జరిగాయి. పాత రోడ్డు తొలగించి వెట్ మిక్స్‌తో చదునుగా లేయర్ పోశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక దీనిపై తారు రోడ్డు నిర్మాణం చేయనున్నారు. ఇంత వరకూ చాలా సంతోషమే. కాని స్థానిక పోలీసు స్టేషన్ దాటి దండుదారి పుంత రోడ్డులోకి వెళ్లే మొదటి మలుపు అత్యంత ప్రమాదంగా ఉంది. ఈ మలుపు వద్ద పంట కాలువ తూర ఉంది. రోడ్డు నిర్మాణ గుత్తేదారులు, అధికారులు ఆ తూరలను తీసి కొత్తవి బిగించి రోడ్డు నిర్మించి ఉంటే సమస్య వచ్చేది కాదు. కాని తూరలను అలాగే ఉంచే దానిపై నుంచే వెట్ మిక్స్‌ను వేసి రోలింగు చేసేశారు. ఈ మలుపులో చెట్టు కొమ్మలు, పొదల కారణంగా రోడ్డు క్లీయరెన్సు లేదు. జంగిల్ క్లీయరెన్సు కూడా రోడ్డు నిర్మాణ దారులు చేయలేదు. ఇప్పుడు రోడ్డు సాఫీగా ఉండటంతో నారాయణపురం వంతెన మూత కారణంగా వాహనాలన్నీ ఇదే దారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. మలుపులో అదుపు తప్పి వాహనాలు పంట కాలువలో పడిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీన ట్రాక్టరు ఇలాగే అదుపుతప్పి ఇదే చోట బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రమాదకర మలుపు

పోలీసులు వేగనిరోధకాలు పెట్టినా లాభం లేదు

ఈ దారి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఈ నెల ఐదో ప్రజాశక్తి వెబ్‌లో వార్త ప్రచురితమవ్వగా చేబ్రోలు ఎస్ఐ మామిడాల సూర్యభగవాన్ వెంటనే స్పందించి మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు పెట్టి వాహనాల వేగం తగ్గేందుకు స్టాపర్ ఉంచారు. కొన్ని గంటల్లోనే ఏదో వాహనం స్టాపర్‌ను ఢీ కొట్టడంతో అది పంట బోదెలోకి బోల్తాపడి మునిగిపోయింది. ఇక్కడ నిత్యం అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సర్వే చేసి మలుపు తీవ్రతను తగ్గించే చర్యలు తీసుకుంటున్నాం
పంచాయతీ రాజ్ డిఇ వేణుగోపాల్

చేబ్రోలు- తల్లాపురం రోడ్డు మార్గంలో పోలీస్టు స్టేషన్ సమీపంలో మలుపు ప్రమాదకరంగా ఉన్న మాట వాస్తవమే. పాత తూరను తీసి కొత్తది బిగింస్తామంటే పంట కాలువ నీటి ప్రవాహం తగ్గుతుందని రైతులు పలువురు అభ్యంతరాలు చెప్పారు. అందుకే రోడ్డు వేసేటప్పుడు పాత తూరను తీయలేకపోయాం. ప్రస్తుతం ప్రమాదాలు జరగకుండా సర్వే చేయించి బోదెను జరిపి తూర వేయడమో, లేదా మలుపు తీవ్రతను తగ్గించడమో ఏది ఆచరణీయమైతే అపని వెంటనే చేయిస్తాం.

నిత్యం ప్రాణాలు గుప్పెట్లోనే
మూర్తి, చేపల ప్యాకింగ్ గుమస్తా

నిత్యం ఇదే రోడ్డుపై ప్రయాణిస్తున్నాను. ఈ మలుపు వద్ద ఎదురెదురుగా వాహనాలు దగ్గరకు వస్తే కాని తెలియడం లేదు. ఎదురెదురుగా ఢీకొనే ప్రమాదం ఉంది. మలుపు తీవ్రతను తగ్గించి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

మహాకవి గురజాడ అప్పారావు

పలుచోట్ల ఘనంగా జయంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహాకవి, గొప్ప రచయిత, సంఘ సంస్కర్త, సాహితీకారుడు, అభ్యుదయ కవితాపితామహులు గురజాడ అప్పారావు 163వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురజాడ అప్పారావు చిత్రపటానికి డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ గురజాడ అప్పారావు గిడుగు రామ్మూర్తితో కలిసి తెలుగు వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారని చెప్పారు. ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కం నాటకాన్ని 1890వ సంవత్సరంలో పూర్తి వాడుక భాషలో రచించారన్నారు. ఆయన రచించిన దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా.. వొట్టి మాటలు కట్టిపెట్టవోయ్.. గట్టిమేల్ తలపెట్టవోయ్ దేశభక్తి గీతం ఇప్పటికీ జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యులని, ఆయనకు కవిశేఖర అనే బిరుదు కూడా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రముఖ సాహితీ సృజనకారులు గురజాడ అప్పారావు, తాపీ ధర్మారావు జయంతి వేడుకలు అరసం ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ, ధర్మారావు చిత్ర పటాలకు అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.పాండురంగారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెవివి నాయకులు పురం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సమకాలీన పరిస్థితుల్లో గురజాడ, తాపీ ధర్మారావుల రచనలను భావితరాలకు అందించాల్సిన, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మతోన్మాదులు అధికారపక్షం అండదండలతో దేశాన్ని తిరోగమనం బాట పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల్లో శాస్త్రీయ అవగాహనను పెంపొందించడానికి శాస్త్రీయ దృక్పథాన్ని హేతువాద భావజాలాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లడానికి గురజాడ, తాపీ ధర్మారావు రచనలు ఎంతగానో ఉపకరిస్తాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం మనిషి ఆలోచనల పైన, పుస్తకాల పైన దాడులు చేసే పరిస్థితుల నుంచి భవిష్యత్తు తరాలను కాపాడడం కోసం ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గురజాడ, తాపీ ధర్మారావు వంటి ప్రసిద్ధ రచయితల రచనలు ఎంతో ఉపకరిస్తాయని, వీటిని జనవాహుళ్యంలోకి తీసుకెళ్లి, కళారూపాలుగా మార్చి ప్రజా వేదికలపై ప్రదర్శించడానికి ప్రగతిశీల సృజనకార్లు, సాంస్కృతిక సంఘాలు విశేషంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ జానపద కళా కారులు వీరమల్ల సత్యనారాయణ లలిత గేయాలు ఆలపించారు. గ్రంథ పాలకులు ఆర్.రత్నకిషోర్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా సీనియర్ నాయకులు టివిఎస్.రాజు, సాహితీ స్రవంతి నేత సింగంశెట్టి సూర్యకుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


ఏలూరులో...


టి.నరసాపురంలో...

కలిదిండి : కవి శేఖర గురజాడ అప్పారావు జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రచించిన కన్యాశుల్కం, పూర్ణమ్మ కథ నాటక విశేషాలను శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు వివరించారు. సాహితీ మిత్రులు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' అందించాలి

రైతు సంఘం మండల మహాసభ సభలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్
మండల నూతన కమిటీ ఎన్నిక
అధ్యక్షులుగా జయరాజు, కార్యదర్శిగా రామారావు

మండల మహాసభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని, ధాన్యం క్వింటాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సుంకర వారి తోట కనకదుర్గమ్మ ఆలయం వద్ద రైతు సంఘం ఏలూరు మండల మహాసభ తలారి జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని పలు రైతుల సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో కష్టపడుతున్న, అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమని విమర్శించారు. కౌలు రైతుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ధాన్యం ఉత్పత్తికి పెరిగిన పెట్టుబడుల రీత్యా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 ప్రకటించాలని కోరారు. కౌలు రైతుల పేర్లతోనే ధాన్యం కొనుగోలు చేయాలని, ఈ క్రాప్‌లో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలని కోరారు. ఈ మహాసభలో మండలంలోని గ్రామాలను వచ్చిన రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో ఏలూరు మండల కమిటీ ఎన్నికైంది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు మండలాధ్యక్షులుగా తలారి జయరాజు, మండల కార్యదర్శిగా వాడవల్లి రామారావు, మండల ఉపాధ్యక్షులుగా మాను కొండ సాయిబాబు, మండల సహాయ కార్యదర్శిగా బైరెడ్డి లక్ష్మణరావు, మండల కమిటీ సభ్యులుగా అన్నంరెడ్డి రంగారావు, పైడిపాటి భాస్కరరావు, తలారి జ్యోతి కుమారి, మరో పది మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

జయరాజు

రామారావు

ప్రపంచ శాంతి కోసం పాటుపడాలి

రెడ్‌క్రాస్, మానవత ఆధ్వర్యాన అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మానవత సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలను ఆదివారం ఏలూరులోని రెడ్ క్రాస్ భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వాలంటీర్లు, మానవత సంస్థ సభ్యులు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రెడ్ క్రాస్ భవనం నుంచి స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య శాంతియుత వాతావరణం పెంపొందించేలా ప్రతి ఏడాది సెప్టెంబర్ 21న ప్రపంచ శాంతి దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. హింసాత్మక చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతో నష్టం వాటిల్లతోందని, శాంతి ద్వారానే ఆయా దేశాల ప్రగతి ఆధారపడి ఉంటుందని శ్రావణ్ కుమార్ అన్నారు. జిల్లా రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, హింస నివారించేలా, శాంతిని పెంపొందించి ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, మానవ హక్కుల సమస్యలు వంటి వాటిపై దృష్టి సారించేలా ఈ దినోత్సవాన్ని చేసుకుంటున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ హింస మార్గాలకు దూరంగా ఉండి శాంతిని పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, జె.సత్యనారాయణ రాజు, మానవత సభ్యులు శాంతికి చిహ్నమైన కపోతాలను ఎగురవేసి శాంతి నినాదాలను చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బెన్నీ, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఎంవివిఎస్.నాగేశ్వరరావు, ఎం.అజయ్‌బాబు, మానవత సభ్యులు ఎ.నిర్మల, ఉత్తమదుర్గ, మోహిని, రత్నాకరరావు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్, మానవత సభ్యులు

సచివాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయరూ..!

సేవలందక ప్రజల అవస్థలు
ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

నగర పంచాయతీ పరిధిలో సచివాలయ ఉద్యోగుల ఖాళీలు భర్తీ చేయకపోవటంతో ప్రజలకు సేవలందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది లేక నగర పంచాయతీలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య చెప్పుకోవడానికి, పరిష్కారానికి ఎక్కడికి వెళ్లాలో తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నామని వాపోతున్నారు. కనీసం వీధిలైట్ల గురించి అడగాలన్నా, డ్రెయినేజీల్లో పూడిక తీయాలన్నా, దోమలు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నా నగర పంచాయతీలో సెక్రటరీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యల పరిష్కారానికి వేరే సచివాలయం వద్దకు వెళ్తే తమ పరిధి కాదని, కుదరదని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. బోయగూడెం, బట్టువారిగూడెం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా కానిస్టేబుల్, ఎఎన్ఎం తప్ప మిగిలిన పోస్టులు మొత్తం ఖాళీగా దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సేవల కోసం సచివాలయం వద్దకు వచ్చి వెనక్కి వెళ్తున్నారన్నారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినవారు, ఇతర సేవల కోసం వచ్చే వారు నిరాశతో వెనక్కి వెళ్తున్నారన్నారు. సచివాలయంలో పోస్టులు ఖాళీగా ఉన్నా నగర పంచాయతీ కమిషనర్ ఎందుకు దృష్టి పెట్టటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోయగూడెం సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు

సాయం అందిస్తున్న మానవత సభ్యులు

ఆపన్నులకు అండగా 'మానవత'

ప్రజాశక్తి - మండవల్లి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో మానవత సంస్థ ముందుంటుందని మానవత సంస్థ మండలాధ్యక్షులు కూనపరెడ్డి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన కూనపురెడ్డి పాండురంగకు మానవత సంస్థ ద్వారా ఆర్థిక సహాయాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా కెరియర్ గైడెన్స్ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయకుమార్‌తో కలిసి ఆయన ఆదివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి చేదోడుగా ఉంటూ ఆర్థిక సహాయం అందించాలనే సదుద్దేశంతో మానవత సంస్థ ఏర్పడిందన్నారు. ఇప్పటికే ఆపదలో ఉన్న ఎంతో మందిని ఆదుకోవడంతోపాటు పేద విద్యార్థులకు, విద్యకు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఇదే నేపథ్యంలో గన్నవరం గ్రామానికి చెందిన కూనపురెడ్డి పాండురంగ పనులు నిర్వహించుకుంటూ సింగరాయపల్లె వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో కానుకొల్లు వద్ద ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. దీంతో జీవనోపాధి కోల్పోయి కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని మానవత సంస్థ దృష్టికి వచ్చిందన్నారు. పాండురంగ కుటుంబాన్ని ఆదుకునే విధంగా మానవత సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతో పాటు రూ.ఏడు వేల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ కోశాధికారి కిన్ని బాబు తలపండి ప్రసన్నాంజనేయులు, గంజాల శ్రీనివాసరావు, గాది వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సుబ్రహ్మణ్యం, సాయికుమార్, కొల్లా నాగరాజు, వరద గంటయ్య, గుబిలి మోహన్, వంశీకృష్ణ, కోట శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై కూటమి దాడి

ప్రజాశక్తి - నిడమర్రు

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మికుల కుటుంబాలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకొచ్చిన తర్వాత కార్మికుల హక్కులపై దాడి చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు హెచ్చరించారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం సిఐటియు మండల కన్వీనర్ కానూరు రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడం కోసం తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మికవర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని పది గంటలకు పెంచుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిందన్నారు. ఇది కార్మికుల హక్కులపై దాడి చేయడమేనన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని, లేకపోతే కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కంచ వరప్రసాద్, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 22వ తేదీ సోమవారం రేచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి యర్రగుంటపల్లి ఫీడర్, శంఖుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి సత్య సాయి ఫీడర్, 11 కెవి తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం ఆయా ఫీడర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సౌజన్యంతో రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం కావడంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరుతున్నారని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, ప్రస్తుత ఎంపిటిసి సభ్యురాలు కొండ్రుపాటి వెంకమ్మ, ఆమెతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, టిడిపి గోపవరం అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్, వైస్ ప్రెసిడెంట్ సాయల జగ్గయ్య, కార్యదర్శి కఠ్ర యేసుపాదం ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి గణేష్ మాట్లాడుతూ గోపవరంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు చేసే పనులను పరిశీలించి వైసిపి నుంచి ఎంపిటిసి సభ్యులు కొండ్రుపాటి వెంకమ్మ, తీరువిధుల అజయ్, జి.ప్రకాశం, టి.మురళితో పాటు 42 మంది వరకు టిడిపిలో చేరారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.